# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 9, అక్టోబర్ 2025


## శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

**★ ముగ్గురిపై కేసు నమోదు, ఇద్దరి అరెస్ట్ : శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్**




**జైపూర్, అక్టోబర్ 08, ప్రభాతవార్త**

గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించి, ఒక వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి దాడి చేసిన ఘటనలో మండలంలోని కుందారం గ్రామానికి చెందిన ముగ్గురు యువకుల పై కేసు నమోదు అయిందని, ఇద్దరిని అరెస్ట్ చేయగా ఒకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, ఎస్ఐ శ్రీధర్‌లు విలేఖరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కుందారం గ్రామానికి చెందిన దాసరి నరేష్, మారేం అజయ్, బోగే ప్రశాంత్ అనే ముగ్గురు యువకులు చెడు వ్యసానాలకు బానిస అయి, చేతిలో కర్రలు పట్టుకొని తిరుగుతూ శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తున్నారు. గ్రామానికి చెందిన జక్కం అంజన్న ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటోను దొంగిలించి, ఇంటికి ఏర్పాటు చేసుకున్న సీసీ మిగతా 2లో..

## ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి

**● రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**



**ఆసిఫాబాద్, అక్టోబర్ 08, ప్రభాతవార్త**

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలని, నామినేషన్ల ప్రక్రియ నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, పోలీస్ అధికారులు, ఎన్నికల అధికారులు, జిల్లా పరిషత్, పంచాయతీ శాఖల అధికారులతో 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలలో భాగంగా ఈ నెల 9వ తేదీన జెడ్పిటిసి, ఎంపిటిసి స్థానాల మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణ కొరకు బందోబస్తు, అధికారులు, సిబ్బంది నియామకం ఇతర ఎన్నికల అంశాలకు సంబంధించి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు ప్రతి జిల్లాలో రెండు విడతలలో నిర్వహించడం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల నిర్వహణ సజావుగా చేపట్టాలని మిగతా 2లో..




## భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**✻ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 08, ప్రభాతవార్త**

భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాలతో కలిసి భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై డివిజన్ లోని మండలాల తహసిల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి గ్రామసభలలో అందిన ప్రతి దరఖాస్తును రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే విధంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. పేరు, తండ్రి పేరు, ఇంటిపేరు, విస్తీర్ణం, విరాసత్ పట్టా మార్పిడి, డిజిటల్ సంతకం కొరకు మిగతా 2లో..



## అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా సాంకేతిక వృత్తి విద్య

**✢ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మందమర్రి, అక్టోబర్ 08, ప్రభాతవార్త**

ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు అధునాతన సాంకేతిక వృత్తి విద్యను అందిస్తుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలోగల అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించి మిగతా 2లో..



## గ్రామాల్లో గులాబీ జెండా ఎగురవేస్తాం

**✪ 100 మందితో బీఆర్ఎస్ పార్టీలో చేరిన సుభాష్ నాయక్**

**✪ కండువా కప్పి ఆహ్వానించిన బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

**బజార్‌హత్నూర్, ప్రభాతవార్త**



మండలంలోని కాండ్లి గ్రామానికి చెందిన జాదవ్ సుభాష్ నాయక్, జాదవ్ వైష్ణవి బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి జోగు రామన్న సమక్షంలో దాదాపు 100 మందితో కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో సిడాం వికాస్, జాదవ్ రాజు, రాథోడ్ ఇందల్ సింగ్, రాథోడ్ శ్రీరామ్, అర్విందు, జాదవ్ ప్రేమ్ సింగ్ మిగతా గ్రామస్తులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా జిల్లా అధ్యక్షులు జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామస్తులు ముఖ్యఅతిథులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జాదవ్ సుభాష్ నాయక్ మాట్లాడుతూ ప్రతీ గ్రామం అభివృద్ధి చెందాలంటే కేవలం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని పార్టీలో చేరమని అన్నారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో ప్రతీ సీటు గెలవబోతున్నామని అన్నారు. ఏ పల్లెకు వెళ్లిన సారె కావాలి, మళ్ళీ కారే రావాలి అంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కానిందే రాజారాం, చిలుకూరి భూమయ్య చిలుకూరి శరత్ కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

కెమెరాలను ధ్వంసం చెసి, ఇంట్లోకి చొరబడి దాడి చేశారు. అంజన్న ఇచ్చిన పిర్యాదు మేరకు ముగ్గురు నిందితుల పై కేసు నమోదు చెసి దాసరి నరేష్, బోగే ప్రశాంత్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మారేం అజయ్‌ను త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు.ప్రశాంత వాతావరణంలో, ప్రజలు సుఖ శాంతులతో జీవనం సాగిస్తున్న తరుణంలో శాంతి భద్రతలకు భంగం కల్గిస్తే ఎంతవారైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ వేణు చందర్ హెచ్చరించారు. యువత భవిష్యత్ పై దృష్టి సారించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు.

## భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తు సమర్పించిన వారు మోకాపై సాగు చేస్తున్నారా అనే విషయాన్ని రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించుకోవాలని, దరఖాస్తులను పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. అనంతరం మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలపై సమీక్షి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ తహసీల్దార్ మధుకర్‌తో పాటు ఇతర మండలాల తహసిల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లు జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండి నామినేషన్ ప్రక్రియ సమీక్షించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత ఎన్నికలలో 8 జెడ్పిటిసి, 71 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నామినేషన్ల స్వీకరణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ అందించడం జరిగిందని, ఎన్నికల నిర్వహణలో వివిధ విభాగాలకు సంబంధించిన నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### - డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 08,ప్రభాతవార్త**

శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వారి ఆధర్వంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఉచిత కంటి పరీక్షలో ఎంపికైన క్యటరక్ట్ పేషంట్లను సొసైటీ ఖర్చులతో రవాణా మరియు భోజనం సదుపాయం కల్పించి 19మందికి ఆపరేషన్ కోసం నేడు బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలలో వేల మందికి తమ సొసైటి ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్ చేయించామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆపరేషన్ చేయించికొని లబ్ధి పొందిన వారు మరి కొంతమందినీ ప్రోత్సహించాలని కోరారు ఈ కార్యక్రమంలో గోపి కిమ్స్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



# అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా సాంకేతిక వృత్తి విద్య

(మొదటిపేజీ తరువాయి)

రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక వృత్తి విద్య కోర్సులను సద్వినియోగం చేసుకొని అభ్యర్థులు స్వయం ఉపాధి పొందాలని తెలిపారు. నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఈ కేంద్రాలలో వృత్తి విద్య కోర్సులను అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ నుండి చేపటనున్న నామినేషన్ల స్వీకరణ, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. మండల, జిల్లా ప్రజా పరిషత్ ఎన్నికలను 2 విడతలలో నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో 16 జెడ్‌పిటిసి, 129 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 9వ తేదీ ఉదయం 10.30 గంటల నుండి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మొదటి విడత ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, 12వ తేదీన నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటయే నామినేటెడ్ అభ్యర్థుల జాబితా, 13వ తేదీన అప్పీళ్ళ స్వీకరణ, 14వ తేదీన అప్పీళ్ళ పరిష్కరణ, 15వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థిత్వం ఉపసంహరణ, 3 గంటల తరువాత పోటీ చేయు అభ్యర్థుల జాబితా ప్రచురణ, 23వ తేదీన పోలింగ్, నవంబర్ 11వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతాయని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో నిబంధనలను పాటించాలని, రిటర్నింగ్ అధికారులు నామినేషన్ ఫారములు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ప్రచార సంబంధించిన అనుమతులు నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సిసి కెమెరాలు, గోడ గడియారాలు, ఓటర్ల జాబితా నిర్వహణ సక్రమంగా ఉండాలని, నామినేషన్ల సమయంలో వీడియోగ్రఫీ ఖచ్చితంగా ఉండాలని తెలిపారు. నామినేషన్ సమయంలో అభ్యర్థులు సమర్పించవలసిన అపిడవిట్లు, ధ్రువపత్రాలు, ఇతర ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. జిల్లాలో జరగనున్న ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమర్ధవంతంగా నిర్వహించాలని, నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## రెండవ సాధారణ ఎన్నికల శిక్షణ కార్యక్రమం

**చింతలమానేపల్లి, అక్టోబర్ 08, ప్రభాతవార్త**

మండలంలోని రుద్రాపూర్ రైతువేదికలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ, మండల ప్రాదేశిక, జిల్లా ప్రాదేశికల 2025 రెండవ సాధారణ ఎన్నికల కొరకు ఎంపీడీవో సుధాకర్ రెడ్డి పిఓ, ఏపీఓలతో బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఉన్నత అధికారులు, ఎంఈఓ జయరాజ్, పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సైనిక్ స్కూల్‌లో సీటు సాధించిన వికుర్వన్

**బోథ్, అక్టోబర్ 08, ప్రభాతవార్త**



మండలంలోని స్థానిక నాగభూషణ్ పాఠశాలకు చెందిన కొచ్చర్ల వికుర్వన్ అనే 6వ తరగతి విద్యార్థి నేషనల్ సైనిక్ స్కూల్‌లో సీటు సాధించాడు. ఇటీవల విడుదలైన మూడవ లిస్టులో జార్ఖండ్ రాష్ట్రంలోని టిలైయా సైనిక్ స్కూల్‌కి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ పేర్కొన్నారు. సీటు సాధించిన విద్యార్థి తల్లిదండ్రులు కిరణ్, మాధవిలు సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.



## లెంకల ఓదేలు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న నాతరి స్వామి

**బెల్లంపల్లి, అక్టోబర్ 08, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు లెంకల శ్రవణ్ కుమార్ తండ్రి లెంకల ఓదెలు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఓదెలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అరుణ్ వాల్మీకి, డిసిసి ఓబీసీ కో చైర్మెన్ బండి లక్ష్మణ్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బుకాల రంజిత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కిరణ్, రామీల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించండి

**సారంగాపూర్, అక్టోబర్ 08, ప్రభాతవార్త**

మండలంలో గల చించోలి( బి) గ్రామం నుండి స్వర్ణగ్రామం వరకు వెళ్లే రోడ్డుకి ఇరువైపులా చెట్ల కింద పిచ్చి మొక్కలు పెరగడం జరిగింది. నిత్యం నిర్మల్ కేంద్రానికి వందలాది వాహనాలు తిరుగుతు ఉంటాయి. ఆదివారం రోజున వేలాదిమంది అడెల్లి పోచమ్మ దేవస్థానానికి వస్తూ ఉంటారు. కావున అడవి జంతువులు వచ్చి తగలడంతో ప్రమాదాలు జరుగుచున్నాయి. దీనిని గమనించి ముందుగా చర్యలు తీసుకుంటే ప్రమాదాలను అరికట్టవచ్చు అని ప్రయాణికులు కోరుచున్నారు. అధికారులు వెంటనే స్పందించి పిచ్చి మొక్కలను తొలగించగలరని కోరుకుంటున్నారు. కావున అధికారులు వీటిని గమనించి పిచ్చి మొక్కలను తొలగించగలరని వాహనదారులు కోరుచున్నారు. అదేవిధంగా రోడ్డుకు అక్కడక్కడ కల్వర్టులు గలవు. వాటి దగ్గర పిచ్చి మొక్కలు పెరిగినాయి. అక్కడ సూచికలు లేవు. కావున చిన్నచిన్న మొక్కలు తొలగించి, అధికారులు సూచికలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరినారు.



## వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

**వేమనపల్లి, అక్టోబర్ 08, ప్రభాతవార్త**

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం ఎంపిడిఓ కుమారస్వామితో కలిసి దాస్నాపూర్ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల వసతులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు తాగునీరు, పారిశుధ్యం, కాంపౌండ్ వాల్, వాష్ రూం పనులు పరిశీలించి పనులు పెండింగ్ పనులు త్వరగా పూర్తి చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎచ్ఎం మాధవ్, ఇన్చార్జి హెచ్ఎం జ్ఞానేశ్వర్, పంచాయతీ కార్యదర్శి రజిత పాల్గొన్నారు.



# పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేపట్టాలి

**- ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 08, ప్రభాతవార్త**



జిల్లాలో పత్తి కొనుగోలు ప్రక్రియ కొరకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండలం అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి పలు శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో పత్తి కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం 3.34 లక్షల ఎకరాలలో పత్తి పంట సాగు జరుగుతుందని, 38 లక్షల క్వింటాళ్ల పత్తి పంట దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని, కేంద్ర ప్రభుత్వం పత్తి పంటకు 8,110 రూపాయల మద్దతు ధరను ప్రకటించిందని తెలిపారు. రైతులు కిసాన్ కపాస్ యాప్ ద్వారా పత్తి పంటను విక్రయించుకునేందుకు స్లాట్ బుక్ చేసుకోవలసి ఉందని, వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి రైతుకు యాప్ వినియోగం, స్లాట్ బుకింగ్ పై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో నవంబర్ మొదటి వారంలో పత్తి కొనుగోలు చేపట్టడం జరుగుతుందని, జిన్నింగ్ మిల్లులలో ఏమైనా మరమ్మత్తులు ఉన్నట్లయితే సమయంలోగా పూర్తి చేసుకుని కొనుగోలుకు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు నాణ్యమైన విద్యుత్ అందించాలని, జిన్నింగ్ మిల్లులలో ఎలాంటి అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా అగ్నిమాపక శాఖ తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. తూనికలు కొలతల శాఖ అధికారులు జిన్నింగ్ మిల్లులలో ఎలక్ట్రానిక్ తూకాన్ని తనిఖీ చేయాలని, పత్తి నిల్వలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిన్నింగ్ మిల్లులలో రైతులకు అవసరమైన త్రాగునీరు, నీడ కల్పించాలని, జిల్లాలో 24 జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రైతులు దళారులకు విక్రయించకుండా సిసిఐ కేంద్రాలలో విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అధికారి అశ్వక్ అహ్మద్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, విద్యుత్ శాఖ ఎస్. ఈ. శేషరావు, జిల్లా రవాణా శాఖ అధికారి రామ్ చందర్, సిసిఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ స్థానిక సంస్థల ఎన్నికల బరిలో పోటీ చేస్తుంది

**- సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్**

**బెల్లంపల్లి, అక్టోబర్ 08, ప్రభాతవార్త**




మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తాండూర్ మండల అత్యవసర మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్ అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ తాండూర్ మండల స్థానిక సంస్థల ఎన్నికలో బరిలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పోటీ చేస్తుందని, గతంలో అచ్చులాపూర్ నుంచి 1995లో, 2021లో రెండుసార్లు ఎంపీటీసీగా గెలుపొందడం జరిగినది. రేచీని నుంచి 1988లో సర్పంచ్‌గా గెలవడం జరిగినది. కిష్టంపేట నుంచి 1995లో సర్పంచ్‌గా గెలవడం జరిగినది. చౌటపల్లి నుంచి 1981లో, 1988లో రెండుసార్లు సర్పంచ్‌గా, ఒకసారి ఎంపీటీసీగా గెలవడం జరిగినది. ద్వారకాపూర్ నుంచి 1988లో సర్పంచ్‌గా, 2001లో ఎంపీటీసీగా గెలవడం జరిగినది. కొత్తపల్లి నుంచి 2001లో సర్పంచ్‌గా గెలిచామని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తాండూర్ మండలం నుంచి ఎంపీటీసీగా సర్పంచ్‌గా వార్డు సభ్యులుగా ఎన్నికల బరిలో నిలిచేందుకు సమావేశంలో తీర్మానం చేశామని, ఈ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ అభ్యర్థుల కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సాలి గామ సంతోష్ సిపిఐ జిల్లా సమితి సభ్యులు, బొంతల లక్ష్మీనారాయణ సిపిఐ బెల్లంపల్లి మండల కార్యదర్శి, నరాల ప్రహ్లాద్ సిపిఐ తాండూర్ మండల సహాయ కార్యదర్శి, మలిశెట్టి సత్యనారాయణ సిపిఐ తాండూర్ మండలం సహాయ కార్యదర్శి, పట్టి శంకర్ సిపిఐ తాండూర్ మండల కోశాధికారి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

**- ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 08, ప్రభాతవార్త**

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలు (బాలికలు, బాలురు) సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనం అంశాలను పరిశీలించి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతి రోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, పాఠ్యాంశాల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని తెలిపారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమయపాలనలో నిరక్ష్యం వహించిన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






## ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 08,ప్రభాతవార్త**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తూడూరు దత్తాత్రేయ ఆధ్వర్యంలో వేంపల్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు కొనసాగుతుందని ఏడు రోజుల ప్రత్యేక క్యాంపులో భాగంగా బుధవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 25 మంది వాలంటీర్లు, కరీంతో పాటు పలువురు ఉత్సాహంగా పాల్గొని గ్రామంలోని వాటర్ ట్యాంక్, ప్రైమరీ స్కూల్, టెంబర్, గ్రామ పంచాయతీ ఆఫీస్‌ల పరిసర ప్రాంతాల్లో శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల భద్రత కోసం పోలీసుల ముందడుగు

**- రహదారిపై గుంతలు పూడ్చిన ఎస్ఐ, పోలీసు సిబ్బంది**

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 08,ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలం పెద్దవాగు సమీపంలోని ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితిని గమనించిన కాగజ్‌నగర్ రూరల్ ఎస్ఐ సందీప్ కుమార్ సిబ్బందితో కలిసి ఉన్నతాధికారుల సూచనల మేరకు బుధవారం రహదారిపై ఉన్న గుంతలను కంకర, ఇసుక, సిమెంట్‌తో పూడ్చే చర్యలు చేపట్టారు. ప్రమాదాలు నివారించడానికి పోలీసు శాఖ స్వయంగా ముందుకొచ్చి చర్యలు తీసుకోవడం పట్ల ప్రజలు ఎస్ఐ సందీప్ కుమార్, పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. సాధారణంగా ఆర్అండ్‌బీ శాఖ చేయవలసిన పనిని పోలీసులు చేసి ప్రజల ప్రాణాలను కాపాడటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల శిక్షణ కార్యక్రమం

**పెంచికల్‌పేట్, అక్టోబర్ 08,ప్రభాతవార్త :**

ఎన్నికల నిర్వహణ సజావుగా చేపట్టాలని ఎంపిడిఓ ఆల్బర్ట్ తెలిపారు. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణ సిబ్బందికి అవగహన కలిపించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికల నిర్వహణను చేపట్టాలని ఎన్నికల విధానాలను పూర్తి స్థాయిలో తెలిపారు. ఈ కార్యక్రమములో అధికారులు పాల్గొన్నారు.



## విద్యుత్ తీగలు సరిచేసిన అధికారులు

వేమనపల్లి, అక్టోబర్ 08, ప్రభాతవార్త







ముల్కలపేట గ్రామంలోని రక్షిత నీటి ట్యాంకుకు వెళ్ళే మార్గంలో విద్యుత్ తీగలు క్రిందికి వేలాడుతూ ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని విద్యుత్ తీగలు... ప్రమాద సూచికలు అనే శీర్షికన ప్రభాతవార్తలో ప్రచురితం కాగా ఏఈ దీక్షిత్ ఆదేశాలతో లైన్ ఇన్స్పెక్టర్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బందితో క్రిందకు వేలాడుతున్న తీగలను ఎత్తులో కట్టారు. సమీప కాలనీవాసులు, వాహనాదారుల సమస్యను పరిష్కరించేలా విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రభాతవార్త పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఓటు చోరీ పేరిట కాంగ్రెస్ సంతకాల సేకరణ

దిలావర్పూర్, అక్టోబర్ 08, ప్రభాత వార్త

రాహుల్ గాంధీ పిలుపు మేరకు బుధవారం దిలావర్పూర్ మండల కేంద్రంలో ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పిసిసి జనరల్ సెక్రెటరీ రాంభూపాల్‌తో కలిసి డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఓటు చోరి ఆపాలని కేంద్రానికి సంతకం చేసి తమ అభిప్రాయాన్ని ప్రజలు తెలుపాలని కోరారు. బీహార్ ఎన్నికలు ఉన్న సందర్భంలో ఎలక్షన్ కమిషన్ ఎటువంటి కారణాలు చెప్పకుండా అనేక ఓట్లు తొలగించిందని, ఇది ముమ్మాటికి పౌరుల హక్కులను హరించడమేనని ఆయన తెలిపారు. ఇందులో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సాగర్ రెడ్డి, ఉపాధ్యక్షులు రమణ, కాల్వ, కదిలి ఆలయాల చైర్మన్‌లు అంగూర్ ఉన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం

కౌటాల, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి అవార్డులు ప్రదానం చేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి గావుడే హనుమంతు ఉపాధ్యాయులను అభినందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తు రూపుదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం ద్వారా విద్యా రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌటాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నారాయణ సింగ్, బోదంపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. అరుణ్, ఉపాధ్యాయులు, ఎంఆర్సి సిబ్బంది పాల్గొన్నారు.



# 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

### - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, ప్రభాతవార్త



ఈ నెల 9వ తేదీ నుండి చేపట్టనున్న 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం రోజున జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ నుండి చేపటనున్న నామినేషన్ల స్వీకరణ, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. మండల, జిల్లా ప్రజా పరిషత్ ఎన్నికలను 2 విడతలలో నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో 16 జెడ్‌పిటిసి, 129 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 9వ తేదీ ఉదయం 10.30 గంటల నుండి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మొదటి విడత ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, 12వ తేదీన నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటయే నామినేటెడ్ అభ్యర్థుల జాబితా, 13వ తేదీన అప్పీళ్ళ స్వీకరణ, 14వ తేదీన అప్పీళ్ళ పరిష్కరణ, 15వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థిత్వం ఉపసంహరణ, 3 గంటల తరువాత పోటీ చేయు అభ్యర్థుల జాబితా ప్రచురణ, 23వ తేదీన పోలింగ్, నవంబర్ 11వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతాయని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో నిబంధనలను పాటించాలని, రిటర్నింగ్ అధికారులు నామినేషన్ ఫారములు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ప్రచార సంబంధించిన అనుమతులు నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సిసి కెమెరాలు, గోడ గడియారాలు, ఓటర్ల జాబితా నిర్వహణ సక్రమంగా ఉండాలని, నామినేషన్ల సమయంలో వీడియోగ్రఫీ ఖచ్చితంగా ఉండాలని తెలిపారు. నామినేషన్ సమయంలో అభ్యర్థులు సమర్పించవలసిన అపిడవిట్లు, ధ్రువపత్రాలు, ఇతర ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న పాఠశాల భవన పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు.



## హామీల అమలులో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు విఫలం

### తెబొగకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి

నస్పూర్, అక్టోబర్ 08, ప్రభాతవార్త

గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు విఫలం అయ్యాయని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆర్.కె 7 గని పై నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఏరియా వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్‌తో కలిసి హాజరై, కార్మికులు, మహిళా కార్మికులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు లాభాల వాటా పంపిణీ విషయంలో కార్మికులకు అన్యాయం చేశాయని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు, పలు పెండింగ్ సమస్యలు పరిష్కారించారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెబొగకాసం సెంట్రల్ జాయింట్ సెక్రటరీ పానుగంటి సత్తయ్య, సెంట్రల్ సెంట్రల్ నాయకులు పెట్టం లక్ష్ముఖ్ముఖ్మణ్, నాయకులు వెంగల కుమారస్వామి, తొంగల రమేష్, చిలుకూరి జగదీష్ కుమార్, మల్లికార్జున్, రవీందర్, బిరుదు శ్రీనివాస్, బానోత్ రాజు నాయక్, పదం శ్రీనివాస్, గంధం గురుమూర్తి, బండారి వంశీకృష్ణ, వెంకటేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

జైపూర్, అక్టోబర్ 08, ప్రభాతవార్త

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం జైపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మండల అధికారులు నామినేషన్ స్వీకరణ కేంద్రాలు, రిటర్న్ ఆఫీసర్ రూమ్‌ల ఏర్పాట్లను పరిశీలించారు. ఎం.ఆర్.ఓ వనజా రెడ్డి, ఎం.పి.డి.ఓ సత్యనారాయణ, సీఐ వేణు చందర్, ఎస్.ఐ శ్రీధర్, ఎంపీవో బాపూరావు, మండల విద్యాధికారి శ్రీనివాస్, కార్యాలయ సూపరిండెంట్ భాగ్య లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ మధులత పాల్గొన్నారు. తదనంతరం ఎంపీడీఓ కార్యాలయం లో మండలంలో ఎంపీటీసీ/జడ్పీటీసీల ఓటర్ జాబితాలను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జైపూర్ పంచాయతీ కార్యదర్శి బి. ఉదయ్ కుమార్, మిట్టపల్లి పంచాయతీ కార్యదర్శి బి.సాయి కిరణ్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం

సారంగాపూర్, అక్టోబర్ 08, ప్రభాతవార్త



మండలంలోని స్వర్ణ గ్రామంలో గల ప్రభుత్వ బాలిక ఆశ్రమ పాఠశాలలో వన్యప్రానుల వార్షికోత్స వ ముగింపు సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పరీక్షలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో వన్యప్రాణుల పాత్ర అనే అంశంపై ఈ వ్యాసరచనలో విజేతలకు ఉప అటవీ క్షేత్రాధికారి వజీర్ ఖాన్ ప్రధానోపాధ్యాయురాలు అనూష బహుమతులను ప్రధాన చేశారు. అదే విధంగా ప్రశంసా పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెన్నెల, సంతోష్, సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అక్రమ బోరు తవ్వకం నిలిపివేసిన సింగరేణి అధికారులు

రామకృష్ణాపూర్, అక్టోబర్ 8, ప్రభాతవార్త

సింగరేణి అధికారులు తమ బాధ్యతను చక్కగా నిర్వర్తిస్తూ మరోసారి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. నాన్ సరెండర్ ఏరియాలో అనుమతులు లేకుండా బోరు వేస్తున్న వ్యక్తిని వెంటనే గుర్తించిన సింగరేణి సంస్థ అధికారులు, తక్షణమే అక్కడికి చేరుకుని పనిని ఆపివేశారు. సింగరేణి నియంత్రణలో ఉన్న ప్రాంతాల్లో ఎటువంటి నిర్మాణాలు, బోరు తవ్వకాలు చేయరాదని పునరుద్ఘాటించిన అధికారులు, ఇలాంటి అక్రమ చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. స్థానిక ప్రజలు సింగరేణి సంస్థ యొక్క అప్రమత్తతను అభినందించారు. సింగరేణి అధికారులు భూసంరక్షణ, భద్రతా చర్యల్లో తమ కర్తవ్య నిబద్ధతను మరోసారి చాటుకున్నారు.



